క్లుప్తంగా

రైతు సంక్షేమమే ధ్యేయం

కొడకండ్ల: రైతు సంక్షేమమే ధ్యేయంగా వారికి అండగా సొసైటీ సేవలు అందిస్తున్నట్లు డీసీసీబీ వైస్ చైర్మన్ కుందూరు వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని రైతు సేవా సహకార సంఘంలో నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల అవసరాలకనుగుణంగా విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచుతూ 24 గంటల నిరంతర పెట్రోల్ పంప్ సేవలను కూడా అందిస్తున్నామన్నారు. సమావేశంలో ఎండీ నరేష్‌యాదవ్, వైస్ చైర్మన్ సోమరాములు, డైరెక్టర్‌లు ఉప్పలయ్య, శ్రీనివాస్, సోమేశ్, రమేష్, పుల్సింగ్, తుకారాం, యాకయ్య, కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

జఫర్‌గఢ్: పంట రుణాలు ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 5, 6 తేదీల్లో చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య కోరారు. ఈ మేరకు సోమవారం సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నాయకులు, రైతులతో కలిసి ఆయన ధర్నా కరపత్రాలను అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వు బ్యాంకు నిబంధనల ప్రకారం 18 శాతం పంట రుణాలు ఇవ్వాలన్నారు.

హామీలు నెరవేర్చాలి

పాలకుర్తి: రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మాచర్ల సారయ్య అన్నారు. జిల్లా వ్యాప్తంగా తహసీల్దార్, బ్యాంకుల ఎదుట చేపట్టనున్న ధర్నా కార్యక్రమాల కరపత్రాలను సోమవారం గూడూరు గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సారయ్య మాట్లాడుతూ ఈనెల 5,6వ తేదీన బ్యాంకుల ఎదుట, 11వ తేదీన తహసీల్ ఎదుట చేపట్టనున్న ధర్నాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ హామీని ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బెల్లి సంపత్, చెరుపెల్లి వెంకటయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో అన్ని రకాల వసతులు

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని రకాల వసతులను కల్పిస్తున్నామని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఆస్పత్రిలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు కూడా చేస్తున్నామని చెప్పారు. గర్భిణులు ప్రతీ నెల వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారని, వారికి స్కానింగ్ సౌకర్యం కూడా కల్పించామరు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో నల్లాల చోరీ

బచ్చన్నపేట: బండనాగారం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల సింక్‌లోని నల్లాలను ఆకతాయిలు చోరీ చేసినట్లు హెచ్‌ఎం హేమారాణి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ పాఠశాలకు వేసవి సెలవులు కావడంతో తరగతి గదులకు, బయట గేటుకు తాళం వేసి వెళ్లి సోమవారం రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా వచ్చి చూడగా సింక్ నల్లాలు ఆకతాయిలు విరుగగొట్టి తీసుకెళ్లినట్లు గుర్తించామన్నారు.

ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం తనిఖీ

తరిగొప్పుల: మండలకేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని తహసీల్దార్ మొగుళ్ల మహిపాల్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి మన్నోహిత్ విక్రమరావుతో కలిసి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రెండు బొలేరో వాహనాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తున్న జీలుగ విత్తనాల బస్తాలు పట్టుకున్నట్లు తెలిపారు. అందులో మండలకేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రానికి (బ్యాచ్) చెందిన జీలుగ విత్తనాల బ్యాగులు లభించాయన్నారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో తనిఖీ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం అందించే సబ్సిడీ జీలుగ విత్తనాల్లో అవకతవకలు జరిగినట్లు గుర్తించినట్లు ఏఓ తెలిపారు. రైతులకు విక్రయించిన జీలుగ విత్తనాల బ్యాగులు పోను 36 బ్యాగులు నిల్వ ఉండాల్సి ఉండగా 29 బ్యాగులు మాత్రమే నిల్వ ఉన్నాయని పేర్కొన్నారు. ఏడు జీలుగ విత్తనాల బ్యాగులు వ్యత్యాసం ఉన్నట్లు చెప్పారు. దీంతో సంబంధిత షాపును మూసివేసి నిర్వాహకుడు గాదె సురేష్ వద్ద నుంచి దుకాణం తాళాలు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. విచారణ పూర్తి అయ్యేంత వరకు ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో ఎరువులు, విత్తనాలు విక్రయించకుండా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ తహసీల్దార్ రామారావు, ఎస్సై గుగులోత్ శ్రీదేవి, ఆర్ఐ ఆంధ్రయ్య తదితరులు పాల్గొన్నారు.

‘ప్రతిపక్షాలపై కక్షసాధింపు చర్యలు సరికాదు’

పాలకుర్తి టౌన్: ప్రతిపక్షకాలపై కక్షసాధింపు చర్యలు సరికాదని బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకులు అన్నారు. బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ జోగు గోపిపై కాంగ్రెస్ నాయకులు దాడి చేశారని ఆరోపిస్తూ సోమవారం బమ్మెరలో బాధితుడిని నియోజకవర్గ నాయులు పరామర్శించారు.

కొడకండ్ల: జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



జనగామ: ఏఎంసీలో జెండా ఎగుర వేసి వందనం చేస్తున్న చైర్మన్ శివరాజ్ యాదవ్



జనగామ: డీసీసీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణలో నాయకులు



నర్మెట: తహసీల్దార్ కార్యాలయంలో..





రఘునాథపల్లి: జెండా ఎగురవేస్తున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి

ఘనంగా ఆవిర్భావ దినోత్సవం

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ, పార్టీ, ప్రైవేట్ కార్యాలయాలతో పాటు పలు యువజన సంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో త్రివర్ణ పతాకాలను ఎగురవేసి వందన సమర్పన చేశారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



స్టేషన్‌ఘన్‌పూర్: మున్సిపాలిటీ కార్యాలయంలో జెండాకు వందనం చేస్తున్న కమిషనర్ తదితరులు



తరిగొప్పుల: తహసీల్దార్ కార్యాలయంలో..



జఫర్‌గఢ్: సొసైటీ కార్యాలయం వద్ద..



పాలకుర్తిటౌన్: నృత్యప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు



జనగామ: జెండా ఎగురవేస్తున్న ఎన్పీడీసీఎల్ ఎస్ఈ వేణుమాధవ్



దేవరుప్పుల: తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



జనగామ రూరల్: బీజేపీ కార్యాలయలంలో జెండా ఎగురవేస్తున్న జిల్లా అధ్యక్షుడు రమేశ్



జనగామ: తెలంగాణతల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య



చిల్పూరు: జెండాకు వందనం చేస్తున్న తహసీల్దార్ సరస్వతి, అధికారులు



బచ్చన్నపేట: తహసీల్‌లో జెండాకు వందనం చేస్తున్న తహసీల్దార్ ఫణికిషోర్ తదితరులు



లింగాలఘణపురం: తహసీల్ వద్ద జెండాను ఎగురవేస్తున్న తహసీల్దార్ రవీందర్

అమెరికాలో అవతరణ వేడుకలు నిర్వహించడం గర్వకారణం



డల్లాస్ సభలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

● ఎమ్మెల్యే పల్లా

జనగామ: అమెరికా దేశం డల్లాస్ నగరం డాక్టర్ పెప్పర్ ఎరీనాలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు నిర్వహించడం గర్వకారణమని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం, బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవాలను పురస్కరించుకుని డల్లాస్‌లో సోమవారం జరిగిన సభలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి గ్లోబల్‌గా అభివృధిశగా ముందుకు వెళుతోందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకత్వంలో సాధించిన విజయాలను, అభివృద్ధిని ప్రపంచానికి చాటిచెప్పే అవకాశం అన్నారు. గులాబీ పార్టీ దేశా నికి ఆదర్శంగా నిలిచి పనిచేసిందన్నారు. ఎన్నారైలు రాష్ట్రం శ్రేయస్సు కోసం మద్దతు పలకడం ముఖ్యభూమిక పోషిస్తుందని, ఇలానే ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

రేషన్ కార్డుల పంపిణీ



కొత్త రేషన్‌కార్డుల పంపిణీ చేస్తున్న నాయకులు

జనగామ: పట్టణంలోని 11, 12 వార్డుల వీర్స్ కాలనీ ప్రాంతంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేశారు. తెల్ల రేషన్ కార్డులు రావడంతో ఉచిత సన్న బియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ తదితర సంక్షేమ పథకాలు రానున్నాయని నేతలు అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డుల ప్రతినిధుల యునగందుల వెంకటేష్, బొంతపల్లి నాగరాజు, వంగ యుగంధర్, శ్రీరాం శ్రీనివాస్, కోడం శ్రీను, వెంకటేష్, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, కొండ శ్రీను, సమ్మయ్య పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో మెరిసిన దేవిక



ర్యాంకులు సాధించిన విద్యార్థులను సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, యాజమాన్యం

జాతీయ స్థాయిలో 514 ర్యాంకు

జనగామ: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో పట్టణంలోని బీరప్పగడ్డకు చెందిన బానోత్ దేవిక జాతీయ స్థాయిలో సత్తా చాటింది. బానోత్ మంజుల, రవి దంపతుల చిన్న కూతరు దేవిక జిల్లా కేంద్రంలోని సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో 10వ తరగతి వరకు చదువుకోగా, ఇంటర్మీడియట్ స్థానిక ఏబీవీ జూనియర్ కళాశాలలో విద్యను అభ్యసించింది. ఐఐటీ సీటు కోసం గత నెల మే18వ తేదీన నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష రాసిన దేవిక జాతీయ స్థాయిలో 514తో ఉత్తమ ర్యాంకు సాధించింది. పాప్ కార్న్ వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న తల్లిదండ్రులు, విద్యాబు ద్దులు నేర్పిన అధ్యాపకుల నమ్మకాన్ని దేవిక నిలబెట్టింది. ఉన్నంత చదువులు చదివి దేశానికి ఉపయోగపడే విధంగా తన ఉన్నత చదువు ఉండాలని దేవిక ఆకాంక్షించారు.

ఏబీవీ జూనియర్ కళాశాలలో సంబురాలు

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని ఏబీవీ జూనియర్ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో సత్తా చాటగా, సోమవారం సంబురాలు జరుపుకున్నారు. ఆల్ ఇండియాలో విద్యార్థులు దేవిక 514 ర్యాంకు, బి.సాయిప్రణయ్ 1196, టి.సాయి చరణ్ 3839 ర్యాంకులు సాధించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.కనకరాజు ఆధ్వర్యంలో అధ్యాపకులు, యాజమాన్యం విద్యార్థులను శాలువాతో సత్కరించి, స్వీట్లు తినిపించి అభినందించారు. క్రమ శిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తే ఎక్కడ చదివినా ఇలాంటి ఫలితాలు వస్తా యని కనకరాజపు తెలిపారు.

‘బాలయేసు’ విద్యార్థి ప్రతిభ

దేవరుప్పుల: మండల కేంద్రంలోని బాలయేసు ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ పూర్వ విద్యార్థి జాటోత్ రాకేష్ జేఈఈ అడ్వాన్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. ధర్మాపురానికి చెందిన వ్యవసాయదారుడు జాటోత్ బిచ్చానాయక్ కుమారుడు రాకేశ్ బాలయేసు హైస్కూల్‌లో పదో తరగతి వరకూ చదివారు. అనంతరం పాలిటెక్నిక్ చేసి ఓ ఏడాది పాటు ఎలాంటి కోచింగ్‌కు పోకుండా యూట్యూబ్‌లో ప్రత్యేక తరగతులచే శిక్షణ పొందారు. దేశంలో ప్రతిష్టాత్మకమైన ఐఐటీ సీటు కోసం 18 లక్షల మంది పరీక్ష రాయగా రాకేష్ రాష్ట్రంలో 162 ర్యాంకు, దేశంలో 18,807 ర్యాంకు సాధించారు.

రాకేశ్‌కు ఘనసన్మానం

జేఈఈ అడ్వాన్స్ అర్హత పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చినందుకు బాలయేసు హైస్కూల్ కరస్పాండెంట్ బ్రదర్ జేసురాజు ఆధ్వర్యంలో రాకేశ్‌కు జ్ఞాపికలు అందించి ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



రాకేష్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

అబుదాబిలో తెలంగాణ నాట్యం

జనగామ: రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకుని అబుదాబి(దుబాయ్)లో ఇండియా ఎంబసీ వేదికగా తెలంగాణ ఫ్రెండ్స్ అసోసియేషన్, అబుదాబీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన వేడుకల్లో తెలంగాణ కళాకారులు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఈ వేడుకతో కళాకారులు తెలంగాణ రాష్ట్ర గౌరవాన్ని, సంప్రదాయాలను ప్రపంచానికి మరోసారి చాటి చెప్పారు. అతిథులు ప్రేంచంద్, కుమారి ఆయుషి సుతారియా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. యూఏసీ, రాష్ట్ర గీతాలాపన చేసి దేశ భక్తిని చాటుకున్నారు. జనగామకు చెందిన పేరిణి నృత్య మాస్టర్లు పెరుమాండ్ల సంతోష్, ఒగ్గు కథ విభాగంలో ఒగ్గరవితో పాటు మహిళలు, బాలికలు రాష్ట్రంలోని వివిధ జిల్లాకు చెందిన కళాకారులు శాస్త్రీయ, జానపద నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో అదరగొట్టారు. పేరిణి శివతాండవం, గుస్సాడి నృత్యం, పోతరాజు నృత్యాలు వేడుకలోల హైలెట్‌గా నిలిచాయి. తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సహకారం, దరావత్ రాజ్‌కుమార్ ఆశీస్సులతో ఇంతటి ఘనత సాధించగలిగామని వారు చెప్పారు.



ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

మహాత్ముడి ఆశయ సాధనకు ప్రభుత్వం కృషి

పాలకుర్తిటౌన్: మహాత్మా గాంధీ ఆశయ సాధనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ విగ్రహాన్ని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డితో కలిసి సోమవారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు గంగిశెట్టి ప్రమోద్‌కుమార్, ప్రతినిధులు బోనగిరి విద్యాసాగర్, రంగయ్య, చారగొండ్ల ప్రసాద్ పాల్గొన్నారు.



మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డి

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు



ఇందిరమ్మ ఇంటి ఉత్తర్వులు అందజేస్తున్న విప్ ఐలయ్య, చిత్రంలో ఎమ్మెల్యే శ్రీహరి, కలెక్టర్



బ్యాడ్మింటన్ డబుల్స్‌లో మొదటి బహుమతి గెలుచుకున్న సాయికుమార్, కరుణాకర్‌ను అభినందిస్తున్న జిల్లా అధికారి రేమండ్‌బాబు

జనగామ: రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కలెక్టర్ రిజ్వాన్ భాషా, అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్‌సింగ్, డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏసీపీ పండేరి చేతన్ నితిన్‌తో కలిసి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్తికేయ డ్యాన్స్ వరల్డ్, సమ్మర్ క్యాంపులో శిక్షణ పొందిన మంది విద్యార్థులు, కేజీబీవీ రఘునాథపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్, లింగాలఘనపురం, జనగామ, దేవరుప్పుల విద్యార్థులు తెలంగాణ రాష్ట్ర సాధన గేయాలను ఆలపిస్తూ చేసిన నర్తనలు వీక్షకులను అలరించాయి. అనంతరం మే 31వ తేదీ నుంచి జూన్ 1 వరకు జిల్లా స్థాయిలో నిర్వహించిన క్రీడలు, ఆటల పోటీల్లో మహిళల విభాగంలో ఎం.తిరుమల, (షాట్‌పుట్), రమ్య (మ్యూజికల్ చైర్), శ్రీదేవి, (లెమన్ అండ్ స్పూన్), సరళ (టగ్ ఆఫ్ వార్)లో గెలుపొందగా ముఖ్యఅతిథి చేతుల మీదుగా ప్రశంసపత్రాలు, కప్‌లను అందించారు. పురుషుల విభాగం బి.నాగరాజు,(షాట్ పుట్), బి.సాయికుమార్, బి.కరుణాకర్, (బ్యాడ్మింటన్), పోలీసు శాఖ,(టగ్ ఆఫ్ వార్), పోలీసు శాఖ (క్రికెట్)లో విజయం సాధించిన టీంలకు మెడల్స్ తో పాటు కప్పులను అందజేశారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హత కలిగిన 30 మంది లబ్ధిదారులకు మంజూరు ఉత్తర్వుల పత్రాలను అందించారు. సీఎం కప్–2024లో రాష్ట్ర స్థాయి లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడళ్లను బహూకరించారు. కాగా, వ్యవసాయ శాఖకు సంబంధించి 8 మంది రైతులకు విత్తనాల బ్యాగులు, 707 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజ్ ద్వారా రూ. 60కోట్ల 90 లక్షల చెక్కును మహిళలకు అందించారు. అనతరం అక్కడే ఏర్పా టు చేసిన వివిధ స్టాల్స్‌ను సందర్శించి, జిల్లాకు నూతనంగా కేటా యించిన అగ్నిమాపక యంత్రాన్ని విప్ నడిపించి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీఓ గోపీరామ్, కలెక్టరేట్ ఏఓ మన్సూరీ, డీఆర్డీఓ వసంత, డీపీఓ స్వరూప, డీఓ రామారావు, మునిసిపల్ కమీషనర్ వెంకటేశ్వర్లు, ఆయా శాఖల ఉన్న తాధికారులు రమేష్, రవీందర్, మాధవిలత, విక్రమ్, నరేంద్ర, శ్రీకాంత్, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండ గ్రామంలో మాదిగ కులస్తుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన రేణుకా ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్టాపన, కల్యాణ మహోత్సవాలు నాలుగు రోజుల క్రితం ప్రారంభం కాగా సోమవారం ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన చేపట్టారు. గ్రామ మాదిగ కులపెద్దలు, దేవాలయ కమిటీ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టమైన రేణుకా ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్టాపన, పుట్టకమ్ముట కార్యక్రమాలను వేదపండితులు జీడికంటి వరుణాచార్యులు, శ్రీహరి ఆచార్యులు ఆధ్వర్యంలో చేపట్టగా గ్రామస్తులు హాజరై అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కాగా స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి సోమవారం హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలను చేపట్టారు. మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, ఉమాదేవి పాల్గొన్నారు.

వైభవంగా కంఠమహేశ్వరస్వామి ఉత్సవాలు

రఘునాథపల్లి: అశ్వరావుపల్లిలో గౌడ కులస్తుల ఆధ్వర్యంలో కంఠమహేశ్వరస్వామి, రేణుకా ఎల్లమ్మతల్లి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఉత్సవాల్లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, జగదీష్‌చందర్‌రెడ్డి, దాసరి అనిత పాల్గొన్నారు.

దేశానికే తలమానికంగా అభివృద్ధి



ఇళ్ల ప్రొసీడింగ్‌లు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి తదితరులు

ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏడాదిన్నర కాలంలోనే తెలంగాణ రాష్ట్రం దేశానికే తలమానికంగా అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి జరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆర్‌డీఓ డీఎస్ వెంకన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కడియం మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ముందుగా విద్యార్థులచే చేపట్టిన నాటికలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. అనంతరం మండంలోని వివిధ గ్రామాలకు చెందిన ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ప్రొసీడింగ్స్, మహిళా సంఘాలకు రూ.8.40 కోట్ల విలువైన బ్యాంకు లింకేజీ చెక్కులను పంపిణీ చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, డీఆర్‌డీఏ పీడీ వసంత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాంబాబు, డీపీఓ స్వరూప, చిల్పూరు దేవస్థాన చైర్మన్ శ్రీధర్‌రావు, మున్సిపల్ కమిషనర్ రవీందర్, స్త్రీ, శిశు సంక్షేమ జిల్లా అధికారిణి ఫ్లోరెన్స్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ విజయశ్రీ, ఎంఈఓ కొమురయ్య, వివిధ శాఖల అధికారులు, నాయకులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

తలకిందులుగా ఎగిరిన జాతీయ జెండా

మున్సిపాలిటీ కార్యాలయంలో ఘటన

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలలో భాగంగా జాతీయ జెండాను తలకిందులుగా ఎగురవేసిన సంఘటన స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఘన్‌పూర్ మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ రవీందర్‌గౌడ్ జెండా ఎగురవేస్తుండగా మొదట సరిగ్గా ముడి వేయకపోవడంతో మొదట మొరాయించింది. దానిని కిందికి దించి ముడిని సరిచేసి ఎగురవేయగా జాతీయ జెండా తలకిందులుగా ఉంది. గమనించిన కమిషనర్, మున్సిపాలిటీ సిబ్బంది వెంటనే జెండాను కిందికి దించి సరిచేసి ఎగురవేశారు. స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ కార్యాలయంలో తలక్రిందులుగా జాతీయ జెండా ఎగురవేయడంపై పలువురు అసహనం వ్యక్తం చేశారు. కనీసం జెండాను సరిగ్గా మడికట్టక పోవడం, సక్రమంగా ఎగురవేయకపోవడం తెలియదా అంటూ పలువురు విమర్శలు చేస్తున్నారు.



తలకిందులుగా ఎగురవేసిన జాతీయ జెండా